క్లుప్తంగా

నేడు జెడ్.మేకపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పామూరు: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మాణాన్ని నిర్దేశిత కాలంలోగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్ ఏఈ రామక్రిష్ణ అన్నారు. స్థానిక పోలేరమ్మ దేవస్థానం వద్ద నుంచి రూ.18 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అంతర్గత రోడ్లను ప్రాధాన్యతా క్రమంలో సీసీరోడ్లుగా వేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు యాదాల వెంకటసాయి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విష్ణుప్రియ, కోటపాటి రవికుమార్‌రెడ్డి, వల్లంశెట్టి ఓబులు, గుత్తి మాధవ, రాగిపాటి సుధాకర్, గుత్తి కొండయ్య పాల్గొన్నారు.

ఈసీ వెంకటేశ్వర్లుకు సన్మానం



ఈసీ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సిబ్బంది

గుడ్లూరు: గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు తీసుకున్న బెల్లంకొండ వెంకటేశ్వర్లును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ వినయ్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. మహేష్, చిన్నయ్య, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

కందుకూరు రూరల్: స్థానిక పామూరు రోడ్డులోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, అరచేతులు అరికాళ్లలో కండరాల బలహీనత, కను ఎగువ రెప్పలు బలహీనంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ పి.స్వాతి, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసరావు, ఏఎన్ఎం సత్యవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మసీద్ మద్రాసా నిర్మాణాలకు భూమి పూజ

కనిగిరి రూరల్: పట్టణంలోని పొదిలి రోడ్డులో వర్కర్స్ కాలనీ సమీపంలో ఇబ్రహీం ఖలీలుల్లా మసీద్, మద్రాసా నిర్మాణాలకు బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, మొహతామిన్ మదరసా జామియా నూరల్ హుదా నెల్లూరు మద్రసా, ప్రిన్సిపాల్ ముఫ్తి అబ్దుల్ వహాబ్ సాహెబ్, ప్రకాశం జిల్లా జమీయత్ ఉలమా ప్రెసిడెంట్ సయ్యద్ మొహ్మద్ రఫీ సాహెబ్, మదరసా బోధకులు అబ్దుల్ రహీం, కనిగిరి జమీయత్ ఉలమా అధ్యక్షులు ముఫ్తి అబ్దుల్ కలాం, మున్షి ఇస్మాయిల్, మౌలానాలు మొహ్మద్ ఆలీ, సద్దాం, ఖాశిం, రబ్బాని, గులాం రసూల్, తదితర ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ తనిఖీ

హనుమంతునిపాడు: గ్రామ సచివాలయ పరిధిలో ఆర్‌బీకేల కింద నమోదు చేసి ఈ క్రాప్ బుకింగ్‌ను ఏడీఏ ఈ వెంకట రమణ, తనిఖీ బృంద సభ్యులు పొలాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దొడ్డిచింతల, కిష్టంపల్లి, హాజీపురం గ్రామాల్లో పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలు రైతులకు సూచించారు. ఏఓ సంపత్ కుమార్, వ్యవసాయ సహాయకులు భారతీ, నవ్య, సంధాని పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కనిగిరి రూరల్: రాష్ట్ర స్థాయిలోజరిగిన హ్యాండ్ బాల్, హాకీ పోటీల్లో స్థానిక కృష్ణ చైతన్య కళాశాల విద్యార్థులు పాల్గొని ఇద్దరు నేషనల్ టీంకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణా తెలిపారు. దొనకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 17 హ్యాండ్ బాల్ బాలికల విభాగంలో కళాశాలకు చెందిన విద్యార్థిని గంగిరెడ్డి కావేరీ, జిల్లాప్రథమ స్థానం, అనంతపురంలో జరిగిన అండ్ 19 హ్యాండ్ బాల్ బాలికల విభాగంలో విద్యార్థిని చింతం అనురాధ జిల్లా తృతీయస్థానం, అనకాపల్లిలో జరిగిన అండర్ 17 హాకీ పోటీల్లో బాలికల విభాగంలో మట్టి లతిక నాల్గవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణా, కోచ్ శ్రీదేవి, అధ్యాపకులు సుబ్బారెడ్డి, భద్రయ్య, చైతన్యారెడ్డి, జ్యోష్నప్రవంతి,మమతతదితరులు అభినందించారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- కోటపాడు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం



కల్లూరివారిపాలెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని కోటపాడు, కల్లూవారిపాలెం, బాలిరెడ్డిపాలెం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ అశోక్‌బాబు వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలతో నిరుపేదల ఇంట సంక్షేమ పథకాల పంట పండుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చి ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అంజేస్తూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించకుండా జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులు ప్రజా ధనాన్ని దోచేశారన్నారు. కానీ నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న చేదోడు, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి వినూత్న పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమచేస్తూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందిస్తున్నారన్నారు. పేదలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ అన్నెం కొండారెడ్డి, వైస్ సర్పంచ్ పద్మ, నారపురెడ్డి మహేష్, కల్లూరి సుబ్బారెడ్డి, సానేపల్లి బ్రహ్మారెడ్డి, తిప్పలూరి ప్రతాప్‌రెడ్డి, శ్రీరాముల శ్రీను, కప్పల దానియేలు, బాలు ఈశ్వర్‌రెడ్డి, వడ్లమాని మాల్యాద్రిరెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

భూములను ఆక్వా జోన్ పరిధిలోకి చేర్చుకోవాలి



మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్

టంగుటూరు: ఆక్వా రైతులు తమ భూములను ఆక్వా జోన్ పరిధిలోకి చేర్చుకోవాలని మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్ సూచించారు. మండలంలోని అనంతవరం, వెలగపూడి గ్రామాల్లో మత్స్యశాఖ అధికారులు బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ ఉషాకిరణ్ మాట్లాడుతూ.. రైతులు ఆక్వా జోన్ పరిధిలోకి రావడం వల్ల ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ముఖ్యంగా ఆక్వా జోన్‌లో ఉన్న రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ ఎస్‌వీఎస్ వర్షిణి, పంచాయతీ కార్యదర్శి మక్కెన నరేంద్ర, వీఆర్వో, వీఎఫ్ఏలు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

సీఎస్‌పురం: ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఏఏ గ్రామాలలో పనులు జరుగుతున్నాయి, ఎంత మంది కూలీలు పనులకు వస్తున్నారు, మస్టర్లు వేసే విషయంలో ఏవైనా అక్రమాలు జరుగుతున్నాయా, బిల్లుల చెల్లింపులో పరిస్థితి ఎలా ఉంది వాటి గురించి సమీక్షించారు. కూలీ సంఖ్య పెంచాలని, ఉదయం సాయంత్ర రెండు పూటలా పనులు చేపట్టాలని చెప్పారు. ఏపీఓ సుబ్బారావు, ఈసీ శివన్నారాయణరెడ్డి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ పంపిణీ



మంగమ్మకు ట్రైసైకిల్ అందజేస్తున్న నాయకులు

మర్రిపూడి: మండలంలోని జగ్గరాజుపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కొత్తపల్లి మంగమ్మకు బుధవారం ట్రైసైకిల్ పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు పోగొట్టుకున్న కొత్తపల్లి సుబ్బారావు భార్య మంగమ్మ కర్రల సహాయంతో నడుస్తోంది. బాధితురాలు తన సమస్యను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబు దృష్టికి తీసుకెళ్లింది. దీంతో దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చనతో మాట్లాడి ట్రైసైకిల్ మంజూరు చేయించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొద్దాల మల్లికార్జున, పార్టీ నాయకులు మన్నెం వెంకయ్య, ఆనం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

హనుమంతునిపాడు: మండలంలోని రెండు పాఠశాలల్లో ఎంఈఓ జి. పెద్దిరాజు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బుధవారం కొండారెడ్డిపల్లి జెడ్పీఎస్‌లోని ప్రాథమిక పాఠశాలను, హనుమంతునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఇస్తున్న మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. భోజనం రుచిగా ఉండేట్లు వంట చేసి విద్యార్థులకు అందించాలని కుకింగ్ ఏజెన్సీలకు అందజేశారు. అనంతరం హాజరు, మెనూ పరిశీలించారు. కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, ఈఆర్‌పీలున్నారు.

మార్కెట్ స్థలంలో షాపులు నిర్మిస్తాం



షాపుల నిర్మాణానికి సిద్ధం చేస్తున్న కమిషనర్

కందుకూరు అర్బన్: కందుకూరు పాత కూరగాయల మార్కెట్ స్థలంలో కమర్షియల్ షాపుల నిర్మాణం చేపడుతున్నట్లు కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. బుధవారం పాత కూరగాయల మార్కెట్ స్థలాన్ని శుభ్రం చేసి మార్కింగ్ వేశారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయం వనరులు పెంచుకునేందుకు ఈ స్థలంలో 8 షాపులను నిర్మించి అద్దెకు ఇస్తామని చెప్పారు. నాలుగు రోజుల్లో షాపుల నిర్మాణానికి భూమిపూజ చేస్తామని తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ తల్లపనేని వెంకటేశ్వర్లు, ఏఈ లోకేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శారీరక బలహీనతను అధిగమించాలి



విద్యార్థులతో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపీ వైద్యుడు

మర్రిపూడి: శారీరక బలహీనతను అధిగమించాలని ఫిజియోథెరపీ వైద్యుడు డి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక జనరల్ పాఠశాలలో బుధవారం విభిన్న ప్రతిభావంతులతో వ్యాయాయం చేయించారు. ఎంఈఓ రంగయ్య మాట్లాడుతూ.. దివ్యాంగులు చదువులో రాణించి, ఉద్యోగాలు పొంది భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగికి పింఛను అందజేత



చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛను అందజేస్తున్న వలంటీర్ గంగాధర్

జరుగుమల్లి(సింగరాయకొండ): ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లుకు గ్రామ వలంటీర్ మారంరెడ్డి గంగాధర్ బుధవారం పింఛను అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసిన వలంటీర్‌ను లబ్ధిదారుడితోపాటు గ్రామస్తులు అభినందించారు.

నర్సయ్య మృతి తీరని లోటు



నర్సయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

పామూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లపు నర్సయ్య (70) మృతి పార్టీకి తీరని లోటని జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి అన్నారు. మండలంలోని కమ్మవారిపాలెంకు చెందిన పార్టీ నాయకుడు పల్లపు నర్సయ్య కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ మృతిచెందాడు. నాయకులు నర్సయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గుంజి రవీంద్ర, రామక్రిష్ణ ఉన్నారు.

బుక్ డిపాజిట్ సెంటర్ ప్రారంభం



బుక్ డిపాజిట్ సెంటర్ ప్రారంభిస్తున్న కార్యదర్శి

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయానికి అనుబంధంగా బుధవారం మండల పరిధిలోని రామాయపట్నం లో బుక్‌డిపాజిట్ సెంటర్‌ను ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి ఈ సెంటర్ ను ప్రారంభించారు. అనంతరం చాకిచర్ల బీడీసీయల్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఉలవపాడు శాఖా గ్రంథాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామునికి లక్ష తులసి పూజ



కోదండరామస్వామికి తులసీ దళాలతో పూజ చేస్తున్న మహిళలు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో బుధవారం భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి లక్ష తులసి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణు సహస్ర నామార్చన చేస్తూ స్వామి వారికి తులసీ దళాలతో పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి

గుడ్లూరు: భీష్మ ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని మూర్తింపేటలోని వెంకటేశ్వర ఆలయంలో ఆలయ పూజారి సత్యనారాయణచార్యు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రామాయపట్నం పోర్టు ఎండీ ప్రతాప్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆలయ ఆవరణలో తులసి మొక్కలు నాటారు. సాలిపేట సర్పంచ్ చాపల రమణయ్య, పోర్టు మేనేజరు శేషుకుమార్‌లు ఉన్నారు. మొయిన్ బజారులో ఉన్న రామమందిరంలో మహిళలు పూజలు చేసి విష్ణుపారాయణం చేశారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న కమిషనర్ డీవీఎస్ నారాయణరావు

కనిగిరి రూరల్: మున్సిపాలిటీలోని నీటి కుళాయి, ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు నూరుశాతం వసూళ్లకు ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో అధిక మొత్తంలో పన్నులు ఉన్న ఇళ్లను గుర్తించి రెడ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పన్ను నోటీసులు ఖాతారు చేయని మొండి బకాయిదారులకు గుర్తించి వారికి సంబంధించిన ఆస్తులను చట్ట పరిధిలో జప్తునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ అద్దె షాపుల వారి నుంచి పూర్తి స్థాయిలో బకాయిలు వసూళ్ల చేయాలని, బాకీ చెల్లించని షాపుల వారిని వెంటనే ఖాళీ చేయించాలన్నారు. షాపుల అద్దెలను నెల నెల క్రమం తప్పకుండా వసూలు చేయాలన్నారు. పన్ను వసూళ్లలో సచివాలయ, మున్సిపల్ అధికారులు లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. మేనేజర్ ప్రసాద్, ఆర్ఐ అర్జున్ రావు, అడ్మిన్‌లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జరుగుమల్లి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

జరుగుమల్లి(సింగరాయకొండ): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా, అవినీతికి తావు లేకుండా అర్హులకు పథకాలు అందించాలన్నారు. మండలంలో 20 అభివృద్ధి పనులకుగాను రూ.1.13 కోట్లను జెడ్పీ నిధుల నుంచి అందజేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన అందించడంతోపాటు నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల పింఛన్లు రద్దు చేశారని ఆరోపించారు. పింఛను కోసం మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆటువంటి పరిస్థితి లేదని, వలంటీర్లు నేరుగా ఇంటికి వచ్చి పింఛను అందిస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగా జరగాలని, మార్చిలోగా ఇచ్చిన టార్గెట్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ పి.రామకృష్ణ కోరారు.

వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాండూస్ తుఫాన్ వల్ల పొగాకు పంట నష్టపోయిన 764 మంది రైతులకు రూ.78 లక్షలు వచ్చేలా సిఫార్సు చేశామని, శనగ రైతులు 435 మందికి రూ.19 లక్షల విలువైన విత్తనాలు అందజేశామన్నారు. కామేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో నీటి సమస్య ఉందని వాడుకనీరు లేక రోగులు, ఉద్యోగులు కూడా ఇబ్బంది పడుతున్నామని వైద్యాధికారి రేష్మి తెలిపారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఎంపీడీఓ తెలియజేశారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ బెల్లం నిర్మల, జెడ్పీటీసీ మాతంగి చంద్రలీల, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, ఎంఈఓ బి.నాగేంద్ర వదన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



పొన్నలూరులో గృహ సారథి నివాసంలో మాట్లాడుతున్న అశోక్‌బాబు

- కొండపి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

పొన్నలూరు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా గృహ సారథులు పని చేయాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. పొన్నలూరులో బుధవారం గడ్డం వేణుగోపాల్ నివాసంలో కాఫీ విత్ గృహ సారథి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత కలిగిన కుటుంబాలకు అందేలా గృహ సారథులు పర్యవేక్షించాలన్నారు. వలంటీర్లను సమన్వయం చేసుకుని వారి పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలకు క్షుణ్ణంగా వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలిచే విధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు గొల్లపూడి రమణయ్య, కంచర్ల రవణయ్య, గడ్డం మాల్యాద్రి, పల్లపోతు రమేష్, బోడా మల్లికార్జున, ముదివర్తి శివ, మెండా శ్రీరాములు, కంచర్ల హేమచంద్, నూకల విజయ్, గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న హేతువాద సంఘం నాయకులు

కందుకూరు: గుడ్లూరు మండలం చేవూరు సర్వే నంబర్ 879లో ఆక్రమణకు గురైన చెరువుపోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ భూములు రామదూతస్వామి ఆశ్రమం కింద ఉన్నాయని, ఇవి ఆక్రమణకు గురైన భూములని వీటిని స్వాధీనం చేసుకోవాలని గతంలో ప్రిన్సిపుల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేసినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే సర్వేనంబర్ 883లో కూడా అటవీశాఖ భూమి ఆక్రమణలో ఉందన్నారు. దీనిపై పలు ఫిర్యాదు చేసిన తరువాత భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులకు ప్రిన్సిపుల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేసినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే భూములను స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రెండు నెలల్లో జీప్లస్ త్రీ ఇళ్ల అందజేత



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

కందుకూరు అర్బన్: పట్టణ పరిధిలోని ఉప్పుచెరువు వద్ద నిర్మాణ దశలో ఉన్న జీప్లస్‌త్రీ ఇళ్లను కమిషనర్ ఎస్. మనోహర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రెండు నెలల్లో జీప్లస్‌త్రీ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనున్న నేపథ్యంలో మౌలిక వసతుల పనులను పరిశీలించామన్నారు. జీ ప్లస్‌త్రీ ఇళ్లకు సంబంధించి 90 శాతం రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ సప్‌లై పనులు పూర్తయినట్లు తెలిపారు. స్టీపీ ప్లాంట్ ఒకటి 70 శాతం పూర్తి అయ్యింది దానిని పూర్తి చేసిన వెంటనే లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామని చెప్పారు. మొత్తం 1408 ఇళ్లకు గాను సుమారు 1200 మంది పేర్లు రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేశామన్నారు. మిగిలిన వారు కూడామున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే మార్గదర్శకాల ప్రకారం వాటిని రద్దు చేసి కొత్త వారికి కేటాయించే అవకాశం ఉందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com